మా కలం.. మీ గళం..
# మన గళం
దిన పత్రిక
RNI : APTEL/ 2017/74310
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 270 | శుక్రవారం | 17 - 04 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆఫీస్ లో సంబరాలు



3లో..

# చారిత్రక ఘట్టం 'మహిళా బిల్లు'

- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధాని మోదీ భరోసా
- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై పార్లమెంట్‌లో కీలక చర్చ
- మహిళా బిల్లు క్రెడిట్ అందరిదీ.. ఏకగ్రీవంగా మద్దతివ్వాలని పిలుపు
- విభజన రాజకీయాలు చేసేవారిని మహిళలు క్షమించరని హెచ్చరిక



న్యూఢిల్లీ, మన గళం : దేశ పార్లమెంటరీ చరిత్రలో ఈరోజు చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహిళలకు అవకాశం ఇస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మహిళల పాత్ర అత్యంత కీలకమని వివరించారు. గతంలో సాంకేతిక కారణాలు చూపి 30 ఏళ్ల పాటు ఈ బిల్లును అడ్డుకున్నారని, ఇప్పుడు అన్ని పార్టీలు ఏకాభిప్రాయంతో మద్దతు ఇచ్చి మహిళా సాధికారతకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా బిల్లును వ్యతిరేకించే వారిని దేశంలోని మహిళలు ఎప్పటికీ క్షమించరని ప్రధాని 2 లో..



# కర్నూలు రోడ్డు ప్రమాదం బాధాకరం

**- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**



మన గళం న్యూస్ నెట్ వర్క్ : కర్నూలు జిల్లా చిలకలడోన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టెంపో వాహనంలారీ ఢీకొన్న ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. 2 లో..

# శాయి స్పోర్ట్స్ హాస్టల్ ను తరలింపు పై పోస్ట్‌కార్డు ఉద్యమం



మన గళం,కర్నూలు క్రీడలు : వెయ్యి మంది క్రీడాకారులు హాస్టల్ ను కర్నూలు లోనే కొనసాగించాలని ప్రధానికి గురువారం పోస్ట్ కార్డు లను పంపారు .దశాబ్దాలుగా కర్నూలు క్రీడాకారులకు వరంగా 2 లో..

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మా పూర్తి మద్దతు



**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

(మనగళం న్యూస్ నెట్ వర్క్) : మహిళల కోసం ప్రభుత్వాలు ఇంకా మరెన్నో చర్యలు తీసుకోవాలని,దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం కీలకమని తెదేపా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి 2 లో..

# తెలుగు రాష్ట్రాల మధ్య కొత్త రైళ్లు

- కేంద్ర రైల్వే శాఖ కీలక నిర్ణయం
- నర్సాపురం - చర్లపల్లి మధ్య వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం
- కాకినాడ - లింగంపల్లి సర్వీసు ఇకపై ప్రతిరోజూ అందుబాటులోకి
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్ల పొడిగింపు క్రమబద్ధీకరణ



హైదరాబాద్, మన గళం : ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ భారీ ఊరటనిస్తూ శుభవార్త అందించింది. ప్రయాణికుల రద్దీ మరియు పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని, రెండు కొత్త వారపు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు దక్షిణ మధ్య రైల్వేకు ఆమోదం 2 లో..

# ఇరాన్‌పై అమెరికా చమురు ఆంక్షల విధింపు

- హోర్ముజ్ జలసంధి వివాదంతో ముదిరిన ఉద్రిక్తతలు
- ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చర్యలు
- రెండు డజన్లకు పైగా కంపెనీలు, వ్యక్తులపై ట్రెజరీ శాఖ ఆంక్షలు



వాషింగ్టన్,మన గళం : అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్ 2 లో..

# ఇంటర్ విద్యార్థిని.. ప్రతిభ

**- బైపిసిలో 981 మార్కులు సాధించిన జె.రేఛెల్**



మన గళం,కర్నూలు విద్య : బుధవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో సీనియర్ ఇంటర్ విద్యార్థిని రేచెల్ తన ప్రతిభా,పాటవాలను ప్రదర్శించారు. జె.రంగన్న,జె.సుజాత దంపతుల కుమార్తె రేఛెల్ కర్నూలు నగరంలోని స్థానిక ఆర్.ఆర్.ఆసుపత్రి వద్ద ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో 2 లో..

# జనగణనలో సరికొత్త అధ్యాయం

- స్వీయ నమోదు ప్రక్రియను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- దేశ చరిత్రలో తొలిసారిగా డిజిటల్ పద్ధతిలో ఇంటింటి గణన
- ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా వివరాలు నమోదు చేసిన సీఎం
- ఈ నెల 30 వరకు ప్రజలకు స్వీయ నమోదు చేసుకునే అవకాశం





అమరావతి, మన గళం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చారిత్రాత్మకమైన ఇంటింటి గణన గృహాల జాబితా సేకరణ కార్యక్రమం గురువారం అత్యంత పకడ్బందీగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఈసారి ప్రవేశపెట్టిన వినూత్నమైన 'స్వీయ నమోదు' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో స్వయంగా ఆరంభించారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తన కుటుంబ వివరాలను నమోదు చేయడం ద్వారా ఆయన ఈ డిజిటల్ జనగణనకు శ్రీకారం చుట్టారు. సాంకేతికతను అందిపుచ్చుకుని పారదర్శకమైన గణాంకాలను సేకరించే దిశగా ప్రభుత్వం వేసిన ఈ అడుగు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా 2 లో..

# కర్నూలు రోడ్డు ప్రమాదం బాధాకరం

కర్ణాటకకు చెందిన భక్తులు మంత్రాలయం దర్శనానికి వస్తుండగా తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటన హృదయ విదారకమని అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పీవీఎన్ మాధవ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

# శాయి స్పోర్ట్స్ హాస్టల్ ను తరలింపు పై పోస్ట్‌కార్డు ఉద్యమం

నిలుస్తున్న శాయి స్పోర్ట్స్ హాస్టల్‌ను తిరుపతికి తరలించే ప్రయత్నాలపై క్రీడా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. హాస్టల్‌ను కర్నూలులోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియం ఎదుట పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా జిల్లా క్రీడా సంఘాల నేతలు నాగరత్నమయ్య, సునీల్ కుమార్ మాట్లాడుతూ, రాయలసీమలో వెనుకబడిన కర్నూలు జిల్లా నుంచి ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారవ్వడాని కి ఈ హాస్టల్ ప్రధాన కారణం అన్నారు. ఇప్పుడు దీన్ని తిరుపతికి తరలిస్తే జిల్లా క్రీడాకారుల భవిష్యత్తు అంధకారమవుతుంది అన్నారు. ఇలాంటి నిర్ణయాన్ని చూస్తూ ఊరుకోబో మనీ అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించారు. ఇది ఏ ఒక్క పార్టీ సమస్య కాదని, కర్నూలు జిల్లా క్రీడాభివృద్ధికి సంబంధించిన అంశమని వారు స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులంతా ఏకమై హాస్టల్‌ను కర్నూలు లోనే ఉంచేలా కేంద్రం పై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే క్రీడాకారులతో కలిసి నిరవధిక దీక్షలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మా పూర్తి మద్దతు

పేర్కొన్నారు. తెదేపా మొదటి నుంచి మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. తెదేపా వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు హయాంలోనే తిరుపతిలో తొలి మహిళా యూనివర్శిటీ ఏర్పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో మహిళల హక్కుల రక్షణకు చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, తొలి ఏడాదిలోనే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేశామన్నారు. పాలనను ప్రజల వద్దకు తీసుకువెళ్తూ ఒకటవ తేదీనే ఇంటింటికి పెన్షన్లను అందిస్తున్నట్లు ఆమె పార్లమెంటులో వివరించారు.

# ఇంటర్ విద్యార్థిని.. ప్రతిభ

ఇంటర్ బైపిసి చదివారు. ఈ నేపథ్యంలో తాజాగా వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 981 మార్కులను సాధించి, అటు అధ్యాపకులు, ఇటు తల్లి, దండ్రుల ప్రశంసలకు పాత్రులయ్యారు. రేచెల్ తండ్రి జె.రంగన్న కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా విద్యార్థిని రేచెల్ గతంలో 10వ తరగతి లోనూ స్టేట్ ర్యాంకును సాధించడం గమనార్హం.

# చారిత్రక ఘట్టం 'మహిళా బిల్లు'



హెచ్చరించారు. గతంలో ఈ హక్కును ఎవరైతే అడ్డుకున్నారో, వారి పరిస్థితిని ఎన్నికల్లో మహిళలు అధ్వాన్నంగా మార్చారని గుర్తుచేశారు. "ఒక మిత్రుడిగా సలహా ఇస్తున్నాను.. కేవలం రాజకీయ కోణంలోనే ఆలోచించకండి. అందరం కలిసి ఈ నిర్ణయం తీసుకుంటే అది ఏ ఒక్క పార్టీ విజయం కాకుండా దేశ ప్రజాస్వామ్యానికే గొప్ప విజయంగా మారుతుంది" అని మోదీ పేర్కొన్నారు. మహిళా బిల్లు క్రెడిట్ తమకు మాత్రమే కాదని, దీనికి సహకరించే అన్ని పార్టీలకు దక్కుతుందని, కావాలంటే అందరి నేతల ఫోటోలు వేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై వస్తున్న ఆందోళనలను ప్రధాని ఈ సందర్భంగా పటాపంచలు చేశారు. మహిళా బిల్లు సాకుతో కొందరు ఉత్తరాది, దక్షిణాది అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన పార్లమెంట్ సాక్షిగా తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వానికి చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం అనే భేదాలు లేవని, సమాఖ్య స్ఫూర్తితోనే ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని, ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని తాను వాగ్దానం చేస్తున్నట్లు ప్రధాని హామీ ఇచ్చారు.

రాజకీయాల్లో తమ శక్తిసామర్థ్యాలు నిరూపించుకునేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని, వారికి సరైన అవకాశం కల్పించడమే తమ బాధ్యత అని మోదీ అన్నారు. "మహిళల పురోగతిని కొన్ని పార్టీలు ఎందుకు అడ్డుకుంటున్నాయో అర్థం కావడం లేదు. మహిళల శక్తి మాకు తెలుసు కనుకే వారిని ప్రోత్సహిస్తున్నాం" అని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసమే ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నామని, 30 ఏళ్లుగా క్షేత్రస్థాయిలో మహిళలు చేస్తున్న పోరాటానికి ఈ బిల్లుతో న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా బిల్లుకు మద్దతిచ్చే పార్టీలకే భవిష్యత్తులో మనుగడ ఉంటుందని ఆయన సూచించారు.

ముగింపులో, దేశాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో అందరూ రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ల అమలుతో భారత రాజకీయ చిత్రపటం మారుతుందని, నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల సమాజంలో సమూల మార్పులు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. విభజన రాజకీయాలు చేసే వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారని, ఇప్పటికైనా దేశ హితం కోసం అందరూ కలిసి రావాలని కోరారు. ప్రధాని ప్రసంగం లోక్‌సభలో సభ్యుల హర్షధ్వానాల మధ్య కొనసాగింది, ఇది మహిళా సాధికారత దిశగా ఒక బలమైన ముందడుగుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య కొత్త రైళ్లు

తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కొన్ని ప్రత్యేక రైళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు, మరికొన్ని కీలక రైళ్ల సేవలను పొడిగిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ మరింత మెరుగుపడటమే కాకుండా, ప్రయాణ సమయం కూడా ఆదా కానుంది. కొత్తగా ప్రకటించిన రైళ్లలో చర్లపల్లి-నర్సాపురం-చర్లపల్లి (17061/17062) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రధానమైనది. మే 2వ తేదీ నుంచి ఈ రైలు ప్రతి శనివారం రాత్రి 7:50 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు నర్సాపురంలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7:50 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, గుంటూరు, విజయవాడ, భీమవరం టౌన్ వంటి కీలక స్టేషన్లలో ఆగుతూ వెళ్తుంది. ఇదివరకు ప్రత్యేక రైలుగా ఉన్న ఈ సర్వీసును ఇప్పుడు రెగ్యులర్ సర్వీసుగా మార్చడం గమనార్హం. మరో కీలకమైన రైలు నర్సాపురం-తిరుపతి-నర్సాపురం (17428/17427) మధ్య వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కూడా రైల్వే శాఖ ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 27 నుంచి ఈ సర్వీసు అందుబాటులోకి రానుంది. ప్రతి సోమవారం సాయంత్రం 3:50 గంటలకు నర్సాపురంలో బయలుదేరి, మరుసటి రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మే 3 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 10:10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9:30 గంటలకు నర్సాపురం చేరుకుంటుంది. ఈ రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా ప్రయాణిస్తుంది. ఇతర రైళ్ల సేవల విషయానికి వస్తే, ఇండోర్-లింగంపల్లి-హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌ను (20916/20915) చర్లపల్లి వరకు పొడిగించారు. ఈ మార్పు ఏప్రిల్ 25 నుంచి అమల్లోకి రానుంది. అలాగే, ప్రయాణికుల నుంచి భారీ డిమాండ్ ఉన్న కాకినాడ టౌన్-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను (12775/12776) వారానికి మూడు రోజుల నుంచి రోజువారీ సర్వీసుగా మార్చారు. ఈ రైలుకు సామర్లకోటలో అదనపు స్టాపింగ్‌ను కూడా కేటాయించారు. ఈ మార్పులు ఏప్రిల్ 21 నుంచే అమల్లోకి వస్తాయని రైల్వే అధికారులు వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న ఈ నిర్ణయాలపై ప్రయాణికుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వేసవి సెలవుల దృష్ట్యా రద్దీ పెరుగుతున్న సమయంలో ఈ కొత్త రైళ్లు మరియు రోజువారీ సర్వీసులు ఎంతగానో ఉపయోగపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. నర్సాపురం ప్రాంతం నుంచి హైదరాబాద్ మరియు తిరుపతికి నేరుగా రైళ్లు అందుబాటులోకి రావడం వల్ల కోస్తా తీర ప్రాంత వాసులకు రవాణా సౌకర్యం మరింత సులభతరం కానుంది. దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలోని ప్రధాన స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# ఇరాన్‌పై అమెరికా చమురు ఆంక్షల విధింపు

ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, ఆ దేశ చమురు పరిశ్రమపై అమెరికా కఠినమైన ఆంక్షలను ప్రకటించింది. ఇరాన్ ఆదాయ మార్గాలను దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా ఇరాన్ ఇంధన రవాణా మౌలిక సదుపాయాలతో పాటు, రెండు డజన్లకు పైగా వ్యక్తులు, కంపెనీలు మరియు ఓడలపై ఈ ఆంక్షలు ప్రభావం చూపుతాయని అధికారులు వెల్లడించారు. సముద్ర మార్గంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయాలకు గతంలో ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులను కూడా అమెరికా తక్షణమే రద్దు చేయడం గమనార్హం. ఇరాన్ ప్రభుత్వం 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను బందీగా మార్చుకుని ప్రపంచ దేశాలను ఇబ్బంది పెట్టాలని చూస్తోందని, ఆ దేశ ఆదాయ సామర్థ్యాన్ని నిర్ణయాత్మకంగా కట్టడి చేసేందుకే తాము ఈ చర్యలు చేపడుతున్నామని అమెరికా విదేశాంగ శాఖ ఒక ప్రత్యేక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇరాన్ ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి, అక్రమ మార్గాల్లో లాభపడాలని చూస్తున్న షమ్ఖానీ కుటుంబం వంటి ఉన్నత పాలక వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆంక్షలు విధిస్తున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ తెలిపారు. ప్రపంచ ఇంధన మార్కెట్లలో అస్థిరత సృష్టించాలనే ఇరాన్ ప్రయత్నాలను అడ్డుకుంటామని అమెరికా హెచ్చరించింది. కొద్ది రోజుల క్రితమే ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా 30 రోజుల పాటు తాత్కాలిక మినహాయింపు ఇచ్చింది. అయితే, ఇరాన్ తన పంథాను మార్చుకోకపోవడంతో మినహాయింపు గడువు తీరకముందే అమెరికా మళ్లీ కఠిన వైఖరిని అవలంబిస్తోంది. ఈ ఆకస్మిక నిర్ణయం వల్ల అంతర్జాతీయ చమురు ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి మరింత పెరగనుంది. ఇప్పటికే పశ్చిమ దేశాల ఆంక్షలతో సతమతమవుతున్న టెహ్రాన్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బగా పరిణమించింది. అమెరికా విధించిన ఈ తాజా ఆంక్షల ప్రభావం భారత్ వంటి దేశాల రిఫైనరీలపై తీవ్రంగా పడనుంది. ఇరాన్ నుండి చమురును దిగుమతి చేసుకునే దేశాలకు ఇప్పుడు చెల్లింపులు మరియు రవాణా విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురుకానున్నాయి. ముఖ్యంగా భారతీయ రిఫైనరీలు తమ ముడి చమురు అవసరాల కోసం ప్రత్యామ్నాయ మార్గాలను వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్లోబల్ ఇన్సూరెన్స్ మరియు షిప్పింగ్ నిబంధనలు కఠినతరం కావడం వల్ల ఇరాన్ నుండి చమురు కొనుగోలు చేయడం భారత్‌కు మరింత కష్టతరం కానుంది. ఇది దేశీయంగా ఇంధన ధరల పెరుగుదలకు కూడా దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో, అమెరికా తన నావికా దళాలను కూడా అప్రమత్తం చేసింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం వాటా ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది, కాబట్టి దీనిపై నియంత్రణ కోసం జరుగుతున్న పోరాటం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

# జనగణనలో సరికొత్త అధ్యాయం

మారింది. రాష్ట్ర జనాభా గణన సంచాలకులు జె. నివాస్ ఈ కార్యక్రమం యొక్క విశిష్టతను మరియు సాంకేతిక అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఈ స్వీయ నమోదు ప్రక్రియలో భాగంగా మొత్తం 33 ప్రశ్నలు ఉంటాయని, ఇవి కుటుంబ సభ్యుల వివరాలు, మౌలిక సదుపాయాలు మరియు గృహ వసతులపై ఉంటాయని తెలిపారు. అధికారుల వివరణ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారిక వెబ్‌సైట్ (ంవ.ఛవఅంబం.స్త్రశీఙ.ఱఅ) లోకి వెళ్లి విజయవంతంగా తన వివరాలను నమోదు చేశారు. ఈ ప్రక్రియ వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, గణాంకాల సేకరణలో మానవ తప్పిదాలకు తావుండదని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. జనగణన ప్రక్రియను మరింత సులభతరం మరియు వేగవంతం చేసేందుకు ప్రజలందరూ ఈ స్వీయ నమోదులో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రజలు తమ ఇళ్లకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు కల్పించింది. ఇలా నమోదు చేసుకున్న వారికి ఒక ప్రత్యేక కోడ్ లభిస్తుందని, తదుపరి దశలో ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు ఆ కోడ్ చూపిస్తే సరిపోతుందని అధికారులు వివరించారు. దీనివల్ల ప్రజల గోప్యతకు భంగం కలగకుండా, వారి సౌలభ్యం ప్రకారం వివరాలు అందించే అవకాశం కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అభివృద్ధి పథకాల రూపకల్పనకు ఖచ్చితమైన గణాంకాలు ప్రాతిపదిక అని పేర్కొన్నారు. డిజిటల్ జనగణన ద్వారా లభించే సమాచారం వల్ల భవిష్యత్తులో విద్య, వైద్యం మరియు మౌలిక సదుపాయాల కల్పనలో శాస్త్రీయమైన నిర్ణయాలు తీసుకోవచ్చని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ వెసులుబాటును వినియోగించుకుని ఏపీని డిజిటల్ జనగణనలో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జనగణన విభాగం ఉన్నతాధికారులు మరియు ఐటీ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోంది. గ్రామ మరియు వార్డు సచివాలయాల సిబ్బంది ప్రజలకు ఈ ఆన్‌లైన్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా సులభంగా పూర్తి చేయగల ఈ ప్రక్రియపై ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. ముగింపులో, ఏప్రిల్ 30 తర్వాత ఎన్యూమరేటర్లు నేరుగా ఇళ్లకు వచ్చి మిగిలిన గణన ప్రక్రియను పూర్తి చేస్తారని అధికారులు వెల్లడించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలందించండి

**– జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మన గళం,కర్నూలు వైద్యం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రాలయం మండలం చిలకలడోణ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో తెల్లవారుజామున 3:00 నుండి 3:30 గంటల ప్రాంతంలో 23 మందితో చిక్ మంగళూరు నుండి మంత్రాలయం వెళ్తున్న ఒక ఓపెన్ టాప్ బొలెరో వాహనం, ఎమ్మిగనూరు నుండి మంత్రాలయం వెళ్లే మార్గంలో ప్రమాదానికి గురైందన్నారు. మంత్రాలయానికి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిలకలడోన – గూడూరు క్రాస్ వద్ద గల టోల్ ప్లాజా సమీపంలో సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ప్రయాణం చేస్తున్న 23 మందిలో 8 మంది మరణించారన్నారు. వీరిలో ఇద్దరు పురుషులు, ఐదుగురు మహిళలు మరియు ఒక చిన్నారి ఉన్నారన్నారు. గాయపడిన వారిలో ప్రస్తుతం ఆరుగురు కర్నూలు జిజిహెచ్ లో, ఇద్దరు ఆకాష్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వీరిలో ఇద్దరికి తలకి తీవ్ర గాయాలు అవ్వడంతో వారి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో ఉన్న 8 మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి చేసి, వారిని స్వస్థలమైన చిక్ మంగళూరుకు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మరికొందరు స్వల్ప గాయాలతో ఎమ్మిగనూరులో చికిత్స పొందుతున్నారన్నారు. కలెక్టర్ వెంట కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహసిల్దార్ రవి తదితరులు పాల్గొన్నారు.

# దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం ఆకస్మిక తనిఖీ



మన గళం,కర్నూలు వైద్యం : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి గురువారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం (శక్తి సదన్) ను తనిఖీ చేశారు. కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. వన్ స్టాఫ్ సెంటర్లో చేరే వారి వివరాలు వారి రికార్డులను సక్రమంగా మెయింటైన్ చేయాలని అలాగే సంబంధిత అధికారుల సంతకాలు కచ్చితంగా తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. బాధితులకు విక్టిమ్ కంపెన్సేషన్ త్వరగా అందేలా కృషి చేయాలని అక్కడికి సిబ్బందిని ఆదేశించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న నివాసితులకు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. వారి భోజన వసతి సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా చట్ట పరమైన సమస్యలు వస్తే లీగల్ సర్వీసెస్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఉపయోగించుకోవాలి

**– నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ**



మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి పన్ను చెల్లింపులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆస్తి పన్ను చెల్లింపులకు ఏర్పాటు చేసిన 6 ప్రత్యేక కౌంటర్లను పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 30 లోపు ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీని వినియోగించుకునే అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. శివారు ప్రాంతాల ప్రజలు కార్పొరేషన్ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా తమ ప్రాంతాలకు సమీపంలోని సచివాలయాల్లోనే ప్రత్యేక కౌంటర్లలో చెల్లింపులు చేసుకోవచ్చన్నారు. దండిగేరి, పెద్దపడఖాప 20,21వ సచివాలయాలు, కేఎంసి పాత కార్యాలయం, బి.క్యాంపు, అరోరా నగర్ 56,57వ సచివాలయాలు, గురు రాఘవేంద్ర నగర్, రాజీవ్ గృహకల్ప 92,93వ సచివాలయాలు, కల్లూరు వార్డు కార్యాలయం 84,85వ సచివాలయాలు, లక్ష్మీనగర్, జెఎన్‌ఆర్ నగర్ 61,62వ సచివాలయాల్లో ఈ ప్రత్యేక కౌంటర్లు అమల్లో ఉన్నాయని తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో జనరద్దీ, ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.

# లోక్‌సభ స్థానాల పెంపు ప్రాంతీయ అసమానతలకు మార్గం

- **కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది**
- **లోక్ సభ స్థానాలు జీయస్డీపీ ప్రకారం పెంచాలి, జనాభా లెక్కల ప్రకారం కాదు**
- **ప్రాంతీయ అసమానతలు లేకుండా సెట్ల పెంపు చేయాలని కాంగ్రెస్ డిమాండ్**
- **జిల్లా కాంగ్రెస్ కమిటీ , అధ్యక్షుడు, అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ**



మన గళం,కర్నూలు పాతబస్తీ : గురువారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ భారతదేశంలో లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన దేశవ్యాప్తంగా తీవ్రమైన చర్చకు దారితీసిందని అన్నారు. నేడు పార్లమెంట్ లో రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు మరియు 2026 డిలిమిటేషన్ ప్రక్రియ ద్వారా పార్లమెంటరీ వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలనే యత్నం జరుగుతోంది అని అన్నారు. ఈ ప్రతిపాదన నేపథ్యం లో రాష్ట్రాల వారీగా స్థానాల పునర్విభజనపై స్పష్టమైన వివరాలు వెల్లడించక పోవడం గమనార్హం అని, నిపుణుల అంచనాల ప్రకారం, ఉత్తర భారతంలోని హిందీ బెల్ట్ రాష్ట్రాలకు లోక్‌సభ స్థానాల్లో వాటా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది అని, ప్రస్తుతం ఉన్న 38.1% వాటా సుమారు 43.1%కు పెరగవచ్చని సూచనలు ఉన్నాయి అని అన్నారు. ఇక దక్షిణ భారత రాష్ట్రాల పరిస్థితి విషమంగా మారే ప్రమాదం ఉంది అని, ప్రస్తుతం 24.3%గా ఉన్న వాటా సుమారు 20.7%కు పడిపోవచ్చని అంచనాలు వెల్లడవుతున్నాయి అని, ఇది దేశ సమాఖ్య వ్యవస్థలో ప్రాంతీయ సమతుల్యతను దెబ్బతీసే పరిణామంగా భావించాల్సి ఉంది అని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదు అని కానీ కుల గణన, జన గణన చేసి వాటితో పాటు 2026 సెన్సస్ బేస్ చేసుకొని రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అలానే జనాభా నియంత్రణ లో ముందంజ లో ఉన్న దక్షిణ రాష్ట్రాలు నష్ట పోవడం, జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలు అధిక రాజకీయ ప్రాధాన్యం పొందడం అనేది సమాన ప్రతినిధిత్వ సూత్రానికి విరుద్ధం. ఇది దేశ సమగ్రతకు, సమాఖ్య వ్యవస్థకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది అని అన్నారు.ఈ నేపథ్యంలో, పారదర్శకత లేకుండా ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడాన్ని అగ్ర నాయకులు రాహుల్ గాంధీ గారు, రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల రెడ్డి గారు మరియు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. జీఎస్డీపీ మరియు రాష్ట్రాల మధ్య సమతుల్యతను కాపాడుతూ, అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగే విధంగా విస్తృత స్థాయి చర్చలు జరిపి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రజా స్వామ్య విలువలను కాపాడే దిశగా అన్ని వర్గాల అభి ప్రాయాలను గౌరవించడం అత్యవసరం అని కుల గణన, జన గణన జరిగిన తరువాత, కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేసి, సమాన న్యాయం చేసే విధానాన్ని అవలంబించాలని కోరు తున్నాము అని క్రాంతి నాయుడు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆఫీస్ లో సంబరాలు



మన గళం,కర్నూలు సిటి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి నియమితులైన శుభ సందర్భంగా సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం నంద్యాల బొమ్మలసత్రంలోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ బి సి సెల్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్ లాల్ లు మాట్లాడుతూ నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడం చాలా సంతోషంగా ఉందని ఎంపీ శబరి తరుపున సీఎం కు, నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భవిష్యత్ లో ఉన్నత పదవులు అవరోహించాలని, కేంద్ర మంత్రిగా చూడాలని ఆకాంక్షించారు. అందరికి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల నియోజకవర్గం టీడీపీ నాయకులు ఆనంద్, వీరసింహారెడ్డి, అజయ్, పుల్లారెడ్డి, శివారెడ్డి, ఎరుకులయ్య, నాగమద్దిలేటి, మధు, చిన్న మధు గాంధీ, వహీదా, ఈశ్వరయ్య చిలుకూరి రవిబాబు, శ్రీనివాసరావు, దీపక్ రెడ్డి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్, ఒకటవ వార్డు మహిళలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ బదిలీ



మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : కర్నూలు మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం జీవో నెంబర్ 414 జారీ చేసింది. ఆయన స్థానంలో చల్లా ఓబులేసును నియమించింది. కాగా గతేడాది జులై 11న కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.విశ్వనాథ్, 9 నెలల పాటు నగరానికి సేవలు అందించారు. నగర ప్రజల ఆశలకు, ఆకాంక్షలను అనుగుణంగా పనితీరు కనబరిచారు. పారిశుద్ధ్యం, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పన, వినూత్న కార్యక్రమాలతో అనతి కాలంలోనే నగర ప్రజల్లో మెప్పు పొందారు. నగరంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రైవేటు స్థలాల్లో పదుల సంఖ్యలో జెసిబిలతో పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టడంతో పాటు గుత్తేదారులకు ఒకేసారి రూ. 18 కోట్లు, మరోసారి రూ.11 కోట్ల బిల్లులను చెల్లింపులు చేశారు. బుధవారపేట మెడికల్ కాలేజీ వద్ద మలుపు విస్తరణ వంటి దశాబ్దాల సమస్య పరిష్కారంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర స్థాయి వార్తల్లో నిలిచారు. దామోదరం సంజీవయ్య కూడలి నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.30 కోట్లతో రహదారులు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు.పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు క్రమశిక్షణలు తీసుకుని కొన్ని విభాగాలను ప్రక్షాళన చేశారు. అవినీతి నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తొలిసారి ఆర్వో, శానిటేషన్ ఇన్స్పెక్టర్లుగా మహిళలకు అవకాశం కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ఫీడింగ్ రూం, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్యం, పచ్చదనంపై ప్రత్యేక దృష్టి సారించారు. 'కర్నూలుకు హరితహారం' పేరుతో విడతల వారీగా 30 వేల మొక్కలు నాటించి గ్రీన్ సిటీకి నాంది పలికారు. అందులో ఒకేసారి 6 వేల మొక్కలను సచివాలయాల్లో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. గార్బేజ్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చెత్త వేయడంపై కఠిన చర్యలు చేపట్టారు. రాత్రివేళల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ ప్రతి వీధి గోడలపై సిబ్బంది వివరాలు అందుబాటులో ఉంచి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచారు. యువత, విద్యార్థుల సహకారంతో విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఆర్థిక వనరుల సమీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఎల్ఆర్ఎస్, బిపియస్, పన్ను వసూళ్లను ప్రతిరోజూ సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించారు. విస్తరిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ఆదాయం సమకూర్చేందుకు చర్యలు చేపట్టారు. స్మార్ట్ సిటీ కింద పార్కులు, సెంట్రల్ మిడియన్స్ అభివృద్ధికి చొరవ చూపించారు. కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వేతన బిల్లులను ప్రతి నెల 20వ తేదీకే పంపేలా చర్యలు తీసుకున్నారు. గుత్తేదారులు, ఏజెన్సీల ద్వారా పనిచేసే కార్మికులకు నెలనెలా వేతనాలు అందేలా చూసారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం రూ.82 లక్షలతో 21 రకాల పరికరాలు కొనుగోలు చేశారు. పండుగలు, ఉత్సవాల సందర్భాల్లో కార్మికులను ప్రోత్సహించారు. నగర అభివృద్ధిలో భాగంగా నూతన కార్యాలయ పనులను వేగవంతం చేసి తాత్కాలిక కార్యాలయాన్ని తరలించారు. కుక్కల బెడద నివారణకు తాత్కాలిక డాగ్ షెల్టర్ ఏర్పాటు చేసి సంతాన నిరోధక చికిత్సలను పెంచారు. నగర కూడళ్లలో బ్యానర్లు, పోస్టర్ల నిషేధాన్ని కఠినంగా అమలు చేశారు. కొత్త కూడళ్ల ఏర్పాటు, కుదింపు పనులు చేపట్టారు. ఈట్ స్ట్రీట్లు, వెండర్ జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు.జగన్నాథ గుట్టపై టిడ్కో గృహాలను మరమ్మత్తులు పూర్తి చేసి వందలాది పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. గృహాల కోసం డిడీలు కట్టిన వారికి తిరిగి చెల్లింపుల కోసం ప్రభుత్వంనుంచి నిధులు మంజూరు చేయించారు. భవన నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా సేకరించే విధానాన్ని అమలు చేశారు. గడియారం ఆసుపత్రి అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో చర్యలు చేపట్టారు.ప్రజలతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్, ప్రతినెలా డయల్ యువర్ కమిషనర్, ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు.వచ్చిన కొత్తలో సంతోష్ నగర్ వద్ద పైప్లాన్ లీకేజీ సమస్యను అత్యవసరంగా పరిష్కరించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా పక్కా ప్రణాళిక ద్వారా తాగునీటి సరఫరా చేశారు. నిపుణుల సహాయంతో చాకచక్యంగా లీకేజీలను సమర్థవంతంగా నివారించారు.

# వంటగ్యాస్ సరఫరాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**– జిల్లా కాంగ్రెస్ నాయకులు సాంబశివుడు, బతుకన్న**




మన గళం,కర్నూలు పాతబస్తీ : ప్రజలకు నిత్యవసర వస్తువయిన వంట గ్యాస్ సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని కర్నూలు జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డివి సాంబశివుడు, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న అభిప్రాయపడ్డారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో సాంబశివుడు మాట్లాడుతూ ఈరోజు ఆంధ్రప్రదేశ్ లో గ్యాస్ ప్రజలకు ఎంతో ఇబ్బందిగా తయారైంది కూటమి ప్రభుత్వం ఎలక్షన్స్ ముందు ప్రజలకు ఎన్నో ఉచిత పథకాలు అని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలను ఎన్నో కష్టాలు పెడుతున్నారనీ రైతులు ఎరువులు లేక మళ్ళీ ఇప్పుడు గ్యాస్ కష్టాలు పెడుతున్నారు. నిన్నటిరోజున కూటమి ప్రభుత్వ నాయకుడు గ్యాస్ ఏజెన్సీ చుట్టు తిరిగి 20 నుండి 30 రోజులు అయిన కూడా గ్యాస్ ఇవ్వలేదంట. కూటమి ప్రభుత్వ నాయకులకే గ్యాస్ ఇవ్వలేదు ఇక మాములు సామాన్య సాధారణ ప్రజలకు ఏమి న్యాయం జరుగుతుంది. ఈరోజు గ్యాస్ ఏజెన్సీలు వంట గ్యాస్ ను సరైన సమయానికి ప్రజలకు అందువకుండా బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని సింగల్ సిలిండర్ ఉన్న సామాన్య ప్రజలు అవస్థలు వర్ణనాతీతమణి ఇటువంటి కూటమి ప్రభుత్వం ఎలక్షన్స్ ముందు అంత మాయమాటలు చెప్పి ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తే ఆపదలో ఉంటే ప్రజలను ఆదుకుంటే దానిని నిజమైన పార్టీ నిజమైన నాయకులు అంటారు. మన ప్రజా ప్రతినిధులు నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. వీరు అందరు సంపాదించుకోవాలనే ఆలోచన తప్ప ప్రజలని కాపాడటానికి ఏమి చేయడం లేదు. సంక్షేమము అంటే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తే సంక్షేమం అంటారు. ఎక్కడ చేస్తున్నాడు సంక్షేమం సంక్షేమం లేదు రైతులకు ఎరువులు లేవు కర్నూలు స్మార్ట్ సిటీ లేదు ప్రజలను ఇంత మోసం చేస్తూ రాజకీయం చేస్తూ మేము సాధించాము అన్ని చెప్పుకుంటున్నారు. ఏమి చేశారని సాధించామని చెప్పుకుంటున్నారు. 2 సంవత్సరాలు అయింది. ప్రతి 6 నెలలకు ఒక్క సారి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ఇది ఎంతవరకు న్యాయమని కాంగ్రెస్ పార్టీ తరపున అడుగుతున్నామని సాంబశివుడు ప్రశ్నించారు. అనంతరం ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న మాట్లాడుతూ ఈరోజు గ్యాస్ దేశంలో చాలా కొరత ఉంది ఈ కొరత బీజేపీ ముందు చూపు లేని గ్యాస్ కొరత ఇది ఈ బిజెపి ప్రభుత్వం మోదీ వచ్చినపట్టి నుంచి దేశంలో అన్ని కొరత ఉన్నాయి. బిజెపి ప్రభుత్వం మోదీ వచ్చిన వెంటనే నోట్ల రద్దు చేశారు. బిద ప్రజలు ఇబ్బందులకు గురించేసారు. కరోనా వల్ల ప్రజలు చాలా ఇబ్బందులకు గురించేసారు. కానీ బిజెపి ప్రభుత్వం మోదీ వచ్చాక ఇప్పుడు గ్యాస్ ఇబ్బందులు. ఇవ్వన్నీ బిజెపి ప్రభుత్వం మోదీ వచ్చాకే వస్తున్నాయి. ఈ బిజెపి పార్టీ మోదీ వచ్చిన్నప్పటి నుంచి ప్రజలను ఇబ్బందికి గురించేస్తున్నారు. కానీ ప్రజలకు ఎ విధమైన ఉపయోగం ప్రజలకు లేదు. మీరు మత కలహాలు పెడ్తున్నారు. కులాలకు మతాలకు చిచ్చులు పెడ్తున్నారు. విభజించి పరిపాలన చేస్తున్నారు. ఈ దేశంలో విభిన్న పార్టీలు అన్ని కలిసి అందరూ ఐకమత్యంగా ముస్లింలు, క్రిస్టియన్స్, హిందువులు అందరు కూడా ఐకమత్యంగా ఉండే ఈ దేశంలో మీరు మత కలహాలు పెడ్తున్నారు. ఈ దేశంలో ఆరాధిస్తున్న దేవుళ్ళను విభజిస్తున్నారని బతుకన్న తెలియజేశారు.

# కూరగాయల ధరలు మంట



హైదరాబాద్, మనగళం : సామాన్యుల వంటింట్లో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగి భారంగా మారాయి. గత కొద్దిరోజులుగా స్థిరంగా ఉన్న ధరలు అకాల వర్షాలు, వేసవి తీవ్రత కారణంగా పెరిగి వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పంటలు దెబ్బతినడంతో మార్కెట్‌కు సరఫరా తగ్గిపోవడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

హైదరాబాద్‌లోని ప్రధాన రైతు బజార్లలో ధరలు గణనీయంగా పెరిగాయి. ఇటీవల వరకు కిలో రూ.10 వద్ద లభించిన టమాటా ధర ఇప్పుడు రూ.23కు చేరింది. అలాగే బీన్స్ కిలో రూ.60, బెండకాయ రూ.35కు అమ్ముడవుతున్నాయి. సరఫరా మరింత తగ్గితే ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. విజయవాడలో టమాటా కిలో రూ.28కు చేరగా, గుంటూరులో రూ.22 వద్ద ఉంది. అల్లం, వెల్లుల్లి ధరలు కూడా భారీగా పెరిగి సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా మారుతున్నాయి. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోవడం, ఎండల తీవ్రతతో పూత రాలిపోవడం వంటి కారణాల వల్ల దిగుబడి తగ్గిపోయిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనితో మార్కెట్‌కు వచ్చే లోడ్లు తగ్గి ధరలు పెరుగుతున్నాయి. కూరగాయల ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు కూడా అధికంగా ఉండటంతో మధ్యతరగతి కుటుంబాలపై భారం మరింత పెరుగుతోంది. నెలవారీ ఖర్చులు పెరగడంతో గృహ బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. పరిస్థితులు మెరుగుపడకపోతే ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బడి బాట కార్యక్రమంలో ప్రైవేట్ బడి వద్దు...ప్రభుత్వ బడి ముద్దు.

**– 5సం,, నిండిన పిల్లలు ప్రభుత్వ బడిలో చేరండి...ప్రభుత్వ పతకాలు పొందండి.**
**– ఎంపీపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు కాలప్ప.**







(ఆలూరు మనగళం): ఆలూరు మండల కేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా ప్రవేశపెట్టిన "బడి బాట" కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ స్కూల్ కోయ నగర్ ఆధ్వర్యంలో విద్యార్థులుతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆలూరు పట్టణంలో కోయనగర్ అంతట వీధి వీధి తిరుగుతూ 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని స్లోగన్స్ ఇస్తూ, ప్రజల్లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కాలప్ప మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్యా కు ఎక్కువ ప్రాధాన్యం కల్పిస్తూ, పాఠశాలలో చాలా మార్పులు తీసుకొచ్చింది అన్నారు. బుధవారం వచ్చిన ఇంటర్ ఫలితాలు అందరిని ఆశ్చర్యం కలిగించాయి. ప్రవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ కాలేజీలో చదివే విద్యార్థులకు 952/1000 మార్కులు రావడం గర్వకారణం అన్నారు. ప్రభుత్వ బడిలో ఒత్తిడి లేని నాణ్యమైన విద్యా, 6నుండి 10తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం, పాఠశాల ప్రారంభం రోజునే తల్లికి వందనం డబ్బులు జమ, ఉచిత బట్టలు, బూట్లు, బెల్టు, బ్యాగ్, బుక్స్, నోట్ బుక్స్, డిక్షణరీ ఇంకా మరెన్నో సౌకర్యాలు కలిగిన మన ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించండి అని కోరారు. కావున ప్రవేట్ బడుల లక్షలు లక్షలు ఫీజులు పోసి చవించడం మాని ప్రభుత్వ బడిలో చేర్పించాలని పట్టణంలోని పిల్లల తల్లిదండ్రులకు చెపుతు బడి పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు కాలప్ప, పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు, రంగస్వామి, రాజేశ్వరి, మహేశ్వరీ, హరిత, వహీధ మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లాభాలు చెరిగి నష్టాల్లో ముగింపు

ముంబై, మనగళం : దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ప్రారంభమైనప్పటికీ, చివరకు నష్టాలతో ముగిశాయి. గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు క్రమంగా కిందకు జారాయి. ముఖ్యంగా ఆటో, ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంకింగ్ రంగాల్లో అమ్మకాలు పెరగడం మార్కెట్లపై ఒత్తిడిని పెంచింది. ఉదయం దాదాపు 500 పాయింట్ల లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ మధ్యాహ్నం వరకు అదే ఊపులో కొనసాగింది. అయితే ఆ తర్వాత అమ్మకాలు పెరగడంతో ఒక్కసారిగా క్షీణించింది. ఇంట్రాడే గరిష్ఠంతో పోలిస్తే సుమారు 750 పాయింట్లు కోల్పోయింది. చివరకు 122 పాయింట్ల నష్టంతో 77,988 వద్ద ముగిసింది. ఇదే ధోరణి నిఫ్టీలో కూడా కనిపించింది. ప్రారంభంలో లాభాల్లో ఉన్న నిఫ్టీ, చివరకు 34 పాయింట్లు కోల్పోయి 24,196 వద్ద స్థిరపడింది. బ్యాంక్ నిఫ్టీ కూడా 215 పాయింట్లు పడిపోయింది. షేర్ల విషయానికి వస్తే, భెల్, అదానీ పవర్, సీజీ కన్స్యూమర్, పీబీ ఫిన్‌టెక్, కేన్స్ టెక్నాలజీస్ వంటి షేర్లు లాభాలు నమోదు చేశాయి. మరోవైపు సుప్రీమ్ ఇండస్ట్రీస్, ఆస్ట్రాల్, జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్, హీరో మోటోకార్ప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాలను చవిచూశాయి. ఇక నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ మాత్రం 369 పాయింట్లు పెరగడం గమనార్హం. రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 93.20 వద్ద నమోదైంది. మొత్తానికి, లాభాల స్వీకరణ, రంగాల వారీగా అమ్మకాలు పెరగడం వల్ల మార్కెట్లు నష్టాల్లో ముగిశాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# యుద్ధం ప్రభావం.. పెరగనున్న మందుల ధరలు?

న్యూఢిల్లీ, మనగళం: పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు ఆరోగ్య రంగంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు దెబ్బతినడంతో పాటు ముడి పదార్థాల కొరత ఏర్పడటం వల్ల మందుల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రత్యేకంగా ఫార్మా కంపెనీలు ఉపయోగించే ఏపీఐ (ఆక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్) దిగుమతులు తగ్గిపోవడం పెద్ద సమస్యగా మారింది. దీనికి తోడు రవాణా ఖర్చులు భారీగా పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు కూడా పెరిగాయి. ఈ నేపథ్యంలో మందుల ధరలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని ఫార్మా సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఈ అంశంపై నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ మరియు కేంద్రం మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం కూడా దీనిపై సానుకూలంగా స్పందిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ధరల పెంపుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వొచ్చని తెలుస్తోంది.

ముఖ్యంగా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు ఉపయోగించే మందులతో పాటు ఇతర అత్యవసర ఔషధాల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇది రోగులు మరియు మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉంది.



అయితే ఈ ధరల పెంపు శాశ్వతం కాదని సమాచారం. ముడి పదార్థాల సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు, సుమారు మూడు నెలల కాలానికి మాత్రమే ఈ పెంపును పరిమితం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశముంది. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత మళ్లీ పాత ధరలే అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మొత్తంగాడ ప్రపంచ రాజకీయ పరిస్థితులు ఇప్పుడు ఆరోగ్య రంగానికీ ప్రభావం చూపుతున్నాయి. మందుల ధరల పెరుగుదల సామాన్యులకు మరో సవాలుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## చదువు - అనుభవం

ప్రపంచం వేగంగా మారుతున్న ఈ ఆధునిక కాలంలో “చదువు ముఖ్యమా? లేక అనుభవమా?” అనే చర్చ నిరంతరం కొనసాగుతూనే ఉంది. మానవ వికాసానికి విద్య పునాది అయితే, ఆ పునాదిపై నిర్మించే భవనానికి అనుభవం పటుత్వాన్ని ఇస్తుంది. పాఠశాలలు, కళాశాలలు మనకు సిద్ధాంతాలను, లోక జ్ఞానాన్ని నేర్పుతాయి. ఇవి మన ఆలోచనా విధానాన్ని క్రమబద్ధం చేసి, సమాజంలో ఎలా జీవించాలో ఒక ప్రాథమిక అవగాహనను కల్పిస్తాయి. కానీ వాస్తవ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంలో అనుభవం ఇచ్చే ధైర్యం సాటిలేనిది.

చదువు మనకు ఒక దిక్సూచిలా పనిచేస్తుంది. సైన్స్, టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ వంటి సంక్లిష్ట రంగాల్లో లోతైన అవగాహన సాధించాలంటే విద్య తప్పనిసరి. పుస్తకాల ద్వారా లభించే జ్ఞానం మనలో విశ్లేషణాత్మక ఆలోచనను పెంచుతుంది. ఇది ఒక వ్యక్తికి తర్కబద్ధంగా ఆలోచించే శక్తిని ఇచ్చి, ప్రపంచాన్ని విభిన్న కోణాల్లో చూసేలా చేస్తుంది. సరైన దిశలో నిర్ణయాలు తీసుకునేందుకు చదువు ఒక మార్గదర్శిగా నిలుస్తుంది, ఇది భవిష్యత్తు ప్రయాణానికి అవసరమైన ప్రాథమిక అర్హతను కల్పిస్తుంది.

అయితే, కేవలం పుస్తకాలకే పరిమితమైన జ్ఞానం వాస్తవ ప్రపంచంలో అసంపూర్ణంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. తరగతి గదుల్లో నేర్చుకునే సిద్ధాంతాలకు, క్షేత్రస్థాయిలో ఉండే పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ఈ అంతరాన్ని పూడ్చేదే అనుభవం. పని చేస్తూ ఎదురయ్యే సమస్యలు, చేసే తప్పులు, సాధించే చిన్న చిన్న విజయాలు మనకు అసలైన పాఠాలు నేర్పుతాయి. అనుభవం మనిషికి సహనాన్ని, ఓర్పును మరియు పరిస్థితులకు అనుగుణంగా మారే నేర్పును నేర్పుతుంది, ఇవి ఏ పాఠ్యపుస్తకంలోనూ దొరకవు.

చాలా సందర్భాల్లో ఉన్నత చదువులు చదవని వారు కూడా వ్యాపార, రాజకీయ మరియు కళా రంగాల్లో అద్భుతాలు సృష్టించడం మనం చూస్తున్నాం. దీనికి ప్రధాన కారణం వారు పొందిన ప్రాక్టికల్ జ్ఞానం. ఒక సమస్య ఎదురైనప్పుడు సిద్ధాంతాల కంటే కూడా గతంలో చేసిన పనుల నుండి పొందిన అనుభవమే వేగంగా నిర్ణయం తీసుకునేలా చేస్తుంది. అనుభవం ఉన్న వ్యక్తి సంక్షోభ సమయాల్లో ఒత్తిడిని అధిగమించి స్థిరంగా ఉండగలడు. అందుకే మేధావులు అనుభవాన్ని “జీవితం అందించే గొప్ప డిగ్రీ“ అని పిలుస్తారు.

మరోవైపు, అనుభవం మాత్రమే ఉండి చదువు లేకపోతే ఆధునిక సాంకేతికతను మరియు మారుతున్న నిబంధనలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురుకావచ్చు. చదువు మనిషికి సంస్కారాన్ని, క్రమశిక్షణను నేర్పుతుంది. ఇది సమాజంలో ఇతరులతో ఎలా సంభాషించాలి, వృత్తిపరమైన సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలి అనే విషయాలను బోధిస్తుంది. విద్యావంతుడైన వ్యక్తికి కొత్త విషయాలను త్వరగా గ్రహించే శక్తి ఉంటుంది. ఇది అతని అనుభవాన్ని మరింత వేగంగా మెరుగుపరుచుకోవడానికి తోడ్పడుతుంది.

విజయం అనేది ఒక నాణెం అయితే, చదువు మరియు అనుభవం దాని రెండు పార్శ్వాలు వంటివి. చదువు దారిని చూపితే, అనుభవం ఆ దారిలో వచ్చే రాళ్లు, రప్పలను ఎలా అధిగమించి నడవాలో నేర్పుతుంది. ఈ రెండింటి కలయిక ఉన్నప్పుడే ఒక వ్యక్తి పరిపూర్ణత సాధించగలడు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంపెనీలు కూడా కేవలం సర్టిఫికెట్లను మాత్రమే చూడటం లేదు, ఆ వ్యక్తికి ఉన్న ప్రాక్టికల్ నాలెడ్జ్ లేదా అనుభవాన్ని కూడా ప్రధాన ప్రమాణంగా తీసుకుంటున్నాయి. యువత కేవలం మార్కుల వేటలోనే పడకుండా, చదువుతో పాటు సామాజిక అవగాహనను, పని పట్ల అనుభవాన్ని పెంచుకోవాలి. విద్యార్థి దశలోనే ఇంటర్న్‌షిప్‌లు చేయడం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వంటివి చేస్తే నిజ జీవిత సమస్యలపై అవగాహన వస్తుంది. ఇది వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఏదైనా ఒక విషయాన్ని కేవలం చదవడం కంటే, దానిని స్వయంగా ఆచరించి చూడటంలోనే అసలైన జ్ఞానం దాగి ఉంటుంది. చదువు అనేది గమ్యాన్ని చేరుకోవడానికి కావలసిన వాహనం లాంటిది అయితే, అనుభవం ఆ వాహనాన్ని నడిపే డ్రైవింగ్ స్కిల్ లాంటిది. రెండూ ఉన్నప్పుడే ప్రయాణం సురక్షితంగా, సాఫీగా సాగుతుంది. నేటి విద్యా వ్యవస్థలో కూడా ప్రాక్టికల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉంది. కేవలం బట్టీ పట్టే విధానం కాకుండా, విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను నిజ జీవితంలో ఎలా ఉపయోగించాలో నేర్చుకోవాలి. అనుభవం పెరిగే కొద్దీ మనిషిలో అహంకారం తగ్గి వినయం పెరుగుతుంది. తప్పుల నుండి నేర్చుకోవడం అనేది మనిషిని గొప్ప వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది. అలాగే నిరంతర చదువు మనిషిని ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచుతుంది. కాబట్టి విజయానికి ఇదొక్కటే మార్గం అని చెప్పలేం. చదువు ద్వారా పొందిన జ్ఞానాన్ని, అనుభవం ద్వారా పొందిన నైపుణ్యాన్ని కలిపి ఉపయోగించినప్పుడే సమాజానికి మేలు చేసే గొప్ప ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. ముగింపుగా, చదువు మరియు అనుభవం పరస్పర విరుద్ధమైనవి కావు, అవి పరస్పర పూరకాలు. చదువు మనకు రెక్కలను ఇస్తే, అనుభవం ఎలా ఎగరాలో నేర్పుతుంది. ఈ రెండింటిని సమతుల్యం చేసుకున్న వ్యక్తులే చరిత్రలో గొప్ప విజేతలుగా నిలిచారు. కాబట్టి ప్రతి ఒక్కరూ విద్యను ఒక సాధనంగా, అనుభవాన్ని ఒక పాఠంగా భావిస్తూ నిరంతర అభ్యాసకులుగా ముందుకు సాగాలి. అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుంది.

# పెద్దారవీడు కేజీబీవీలో బాలికల అద్భుత విజయం...

**– ఇంటర్ ఫలితాల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన... నల్లూరి రవేనా**

మన గళం : మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలంలోని పెద్దారవీడు గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఫలితాలు వెలువడగా బాలికలు ఘన విజయాన్ని సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ ఫలితాల్లో నల్లూరి రవేనా అత్యుత్తమంగా 934 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ ర్యాంక్ కైవసం చేసుకుంది. అదే విధంగా కె. కృష్ణవేణి 917 మార్కులతో రెండో స్థానం, జి. గంగ భవాని 875 మార్కులతో మూడో స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తెచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందిస్తూ, వారి కృషి, పట్టుదల వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.






భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. ప్రత్యేకంగా, స్కూల్ ఫస్ట్ సాధించిన నల్లూరి రవేనా పాత్రికేయుడు నాగయ్య రెండో కుమార్తె కావడం విశేషం, ఈ విజయం కుటుంబంతో పాటు మండలానికి గర్వకారణంగా నిలిచింది

# రోడ్డు ప్రమాదం పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంపీ

మన గళం న్యూస్ నెట్ వర్క్ : కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం పై ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలలో భాగంగా ఢిల్లీలో ఉన్న ఆయన ప్రమాద ఘటన పై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా ప్రమాదం లో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.. దైవ దర్శనానికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని 8మంది కర్ణాటక వాసులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఎంపీ , గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.



# రోడ్డు ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

మన గళం,మంత్రాలయం : మంత్రాలయం మండలం చిలకలడోణ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాన్ని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ఉదయం పరిశీలించారు. ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు, పరిస్థితులను కర్నూలు ఎస్పీ తెలుసుకున్నారు. మంత్రాలయం దర్శనానికి వస్తూ కర్ణాటకకు చెందిన 8 మంది ప్రాణాలు కోల్పోవడం భాధకరం అన్నారు. బొలెరో వాహనం రెడిమిక్స్ ట్యాంకర్ ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రమాదంపై ఇప్పటికే కేసు నమోదు చేశామన్నారు. ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని, సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని



తెలిపారు. కర్నూలు ఎస్పీ తో పాటు ఎమ్మిగనూరు టౌన్ సిఐ శ్రీనివాసులు, మంత్రాలయం ఎస్సై మల్లికార్జున ఉన్నారు.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చెయ్యండి పిలుపునిచ్చిన ఏఐటియుసి నాయకులు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణం లో హమాలీ యూనియన్ కార్యాలయంలో ఏఐటియుసి రాష్ట్ర 18 వ మహాసభలు జయప్రదం చెయ్యాలని, 140 వ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర 18 వ మహాసభలకు విరివిగా ప్రజలు పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవస్వామి,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ,సిపిఐ మండల కార్యదర్శి రాజు,సిపిఐ పట్టణ కార్యదర్శి శేషుకుమార్,మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్, బాబురావు,గూడూరు సిపిఐ నాయకులు బీడీల శ్రీనివాసులు, గూడూరు ఏ ఐ టి యు సి నాయకులు ఓబులేసు, విగ్నేష్,హమాలీ సంఘం నాయకులు బజారి, విశ్వనాథ్,ఆటో యూనియన్ నాయకులు మధు, చిన్న, నాగరాజు, దస్తగిరి, సుంకన్న, పారిశుద్ధ కార్మికులు సంజన్న, నాగరాజు, ఇన్సాఫ్ మండల




నాయకులు హీరావలి,జీపు డ్రైవర్ అసోసియేషన్ నాయకులు గిడ్డయ్య, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు

# అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించిన అగ్నిమాపక సిబ్బంది




మన గళం కోడుమూరు; అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని కోడుమూరు అగ్నిమాపక కేంద్ర అధికారి ఎం. మహబూబ్ దౌలత్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్ని మాపక సేవల శాఖ తరపున కోడుమూరు అగ్నిమాపక కేంద్రము వారు అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా మూడవ దినము గురువారం ఉదయము 09:30 గం.ల నుండి కోడుమూరు నగరంలోని మోర్ షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్వహించడం జరిగింది. అపార్ట్ మెంట్ లోని షాప్స్ నందు పని చేయు సిబ్బందికి షాపింగ్ మాల్ లో గ్యాస్ ప్రమాదాలు జరిగినపుడు మొదటగా కిటికీలు తెరవవలేనని ఎటువంటి విద్యుత్ స్విచెస్ ఆఫ్ కాని, ఆన్ కాని చేయకూడదని మరియు షాపింగ్ మాల్ ల యందు అగ్నిప్రమాదము జరిగినపుడు లిఫ్ట్ లను ఉపయోగించ కుండా మెట్ల ద్వారా వెల్లవలెనని మరియు ఇంటి నుండి చాలా కాలము పాటు బయటికి పోయినపుడు విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి వెల్లవలెనని అక్కడ వున్నా మహిళలకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు అగ్ని ప్రమాదము జరిగినప్పుడు ఎలా అర్పివేయవలేనో ప్రయోగ పూర్వకముగా చేసి చూపించారు అలాగే ఈ విషయాలన్నీ క్లుప్తంగా తెలియజేసే కరపత్రాలు పంపిణి ఈ సందర్భంగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో షాపింగ్ మాల్ లోని



సిబ్బంది కోడుమూరు అగ్ని మాపక కేంద్రాదికారి యం. మహబూబ్ దౌలత్ సిబ్బంది తిమ్మోజి ,శివయ్య, వీరాంజనేయులు, రుద్రప్ప,చిదంబర్రెడ్డి , బ్రహ్మేశ్వర రావు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# జలధార - జలహారతి కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం కీలకం: కలెక్టర్

- ఎద్దుపెంట వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్
- 'రిడ్జ్ టు వ్యాలీ' విధానంతో నీటి సంరక్షణకు ప్రాధాన్యం
- భూగర్భ జలాల పెంపుకు విస్తృత చర్యలు
- హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి లక్ష్యం
- 7 గ్రామాలకు ఉపయోగపడే నీటి నిల్వ ప్రాజెక్ట్‌కు ఆమోదం

మన గళం,డోన్/నంద్యాల : జిల్లాలో అమలవుతున్న 'జలధార - జల హారతి' కార్యక్రమంలో ప్రజలు విస్తృతంగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. గురువారం డోన్ మండలం ఉంగరానిగుండ్ల గ్రామంలోని ఎద్దుపెంట వాటర్‌షెడ్ ప్రాజెక్టును ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ శివశంకర్ రెడ్డి, భూగర్భ జల అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణ, డోన్ ఆర్డీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన '100 రోజుల జలధార' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో రాళ్లకు తక్కువ రంధ్రాలు ఉండటంతో వర్షపు నీరు భూమిలోకి చొరబడకుండా పారిపోవడం వల్ల నీటి కొరత ఏర్పడుతోందని వివరించారు. 'రిడ్జ్ టు వ్యాలీ' విధానంలో నీటి సంరక్షణ పనులు చేపడుతున్నట్లు పేర్కొంటూ, వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భంలోకి ఇంకించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పర్కొలేషన్ ట్యాంకులు, డగ్ అవుట్ పాండ్లు, రాక్ ఫిల్ డ్యామ్‌లు, చెక్ డ్యామ్‌లు నిర్మించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచినట్లు చెప్పారు. ఎద్దుపెంట రిజర్వ్ ఫారెస్ట్ నుండి వచ్చే సహజ వాగులను శుభ్రపరిచి నీటి ప్రవాహాన్ని మెరుగుపరచాలని ఉపాధి హామీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఫారెస్ట్-రెవెన్యూ సరిహద్దులో కొత్త పర్కొలేషన్ ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు కొత్త పనులకు 7-10 రోజుల్లో అనుమతులు మంజూరు చేసి వేగంగా పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా భౌగోళిక పరిస్థితులను వివరిస్తూ, అడవులు, సాగునీటి ప్రాంతాలు, ఖనిజ వనరులు ఉన్న ప్రాంతాలుగా విభజన ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, రైతులు అందుబాటులో ఉన్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు మట్టి పరీక్షలు నిర్వహించి, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు, ప్యాక్ హౌస్‌లు, కమ్యూనిటీ ఫామ్ పాండ్లు వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే రెండు నుండి మూడు సంవత్సరాల్లో ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎర్ర నేలలకు అనుకూలంగా కందులు వంటి పంటలను



ఉద్యానవన పంటలతో కలిపి సాగు చేస్తే రైతులకు అధిక ఆదాయం సాధ్యమవుతుందని సూచించారు. ఏడు గ్రామాలకు ఉపయోగపడే నీటి నిల్వ ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ, 'బొబ్బరాల కుంట'పై మరో ట్యాంక్ నిర్మాణాన్ని ఉపాధి హామీ పథకం కింద పరిశీలించనున్నట్లు తెలిపారు. ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 10 రోజుల్లో అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కలసిన మాజీ సర్పంచ్ భాగ్యరత్న

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మాజీ సర్పంచ్ భాగ్యరత్న ఆంధ్రయ్య దంపతులు,డోన్ శాసనసభ్యులు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ని డోన్ లోని వారి స్వగృహం నందు మర్యాద పూర్వకంగా కలసి చిరు సత్కారం చేయడం జరిగింది ఈ సందర్భంగా, మాజీ సర్పంచ్ భాగ్యరత్న మాట్లాడుతూ, ఈ 5 సంవత్సరాలు సర్పంచ్ పదివి కాలంలో మా వెన్నంటి ఉంటూ,ఎన్నో అమ్ముల్యమైన సూచనలు సహాయ సహకారాలు, మనో ధైర్యాన్ని అందించినందుకు, నా పదవి కాలం ముగ్గుసిన సందర్భంగా, మా పెద్దాయనకు కృతజ్ఞతలు తెలపడం జరిగిందని అన్నారు.శ్రీ కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఆనందం వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, గుంతకంటి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు...



# టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సంజీవ్ కుమార్ నియామకం పట్ల ధర్మపురి క్షేత్ర ఆలయ కమిటీ హర్షం

మన గళం కోడుమూరు: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సంజీవ్ కుమార్ నియమితులైన సందర్భంగా కోడుమూరు ధర్మపురి క్షేత్ర శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు విజయ భాస్కర్ రెడ్డి, జీతూరి రవికుమార్, ఆకుల ధనుంజయ, సోమేష్ తదితరులు గురువారం కర్నూలులోని డాక్టర్ సంజీవ్ కుమార్ కార్యాలయాన్ని సందర్శించి, ఆయనను పూలమాలలు, శాలువాతో సత్కరించారు అనంతరం కోడుమూరు ధర్మపురి శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై ఆయనతో చర్చించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని డాక్టర్ సంజీవ్ కుమార్ హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు



# సామాన్యుడిపై యుద్ధం సెగ.. సబ్బుల ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ, మన గళం: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుపై పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరగడం, సముద్ర మార్గాల్లో రవాణా సమస్యలు తలెత్తడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా సబ్బులు, షాంపూల వంటి రోజూ ఉపయోగించే ఉత్పత్తులపై ధరల పెరుగుదల కనిపిస్తోంది. ముడి పదార్థాల ఖర్చులు పెరగడంతో పాటు ప్యాకేజింగ్ వ్యయాలు కూడా కంపెనీలపై అదనపు భారంగా మారాయి. ఈ పరిస్థితుల్లో ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ ఇప్పటికే తన ఉత్పత్తుల ధరలను పెంచే నిర్ణయం తీసుకుంది. లిరిల్, పియర్స్, డవ్ వంటి ప్రముఖ సబ్బుల బ్రాండ్ల ధరలు ఒక్కొక్కటి రెండు నుంచి మూడు రూపాయల వరకు పెరిగినట్లు సమాచారం. చిన్నగా కనిపించినా, రోజువారీ ఖర్చుల్లో ఇది పెద్ద ప్రభావాన్ని చూపనుంది.ఇక రవాణా రంగంలో ఎదురవుతున్న ఇబ్బందులు కూడా పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. సముద్ర మార్గాల్లో ఆటంకాలు ఏర్పడటంతో సరుకు రవాణా ఆలస్యమవుతోంది. దీంతో కంపెనీలు తమ నిర్వహణ ఖర్చులను సమతుల్యం చేసుకోవడానికి ధరలు పెంచక తప్పడం లేదు.

# పరోక్షసేవగా బయలు వీర భద్ర స్వామి వారి విశేష పూజ



మనగళం శ్రీశైలం : ఈ రోజు ( 16.04.2025) సాయంత్రానికి అమావాస్య ఘడియలు రావడంతో శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామి వారికి దేవస్థానం విశేషపూజలను నిర్వహిస్తున్నది. ఈ సాయంకాలం పూజాదికాలు నిర్వహించబడుతాయిప్రతీ మంగళవారం, అమావాస్యరోజులలో ఈ విశేషార్చనను జరిపించడం జరుగుతోంది. కాగా అమావాస్య రోజున భక్తులు కూడా పరోక్షసేవగా ఈ అర్చనను జరిపించుకునే అవకాశం కల్పించబడింది. ఈ రోజు పరోక్షసేవ ద్వారా 31 మంది భక్తులు ఈ విశేషపూజలను జరిపించుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండేకాకుండా కర్ణాటక, తమిళనాడు, న్యూఢిల్లీ, కేరళ, తదితర ప్రదేశాల నుండి కూడా భక్తులు ఈ పూజలను జరిపించుకుంటున్నారు. కాగా ఈ పూజాదికాల కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను నిర్వహించబడుతుంది. ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామివారికి అభిషేకం జరిపించబడుతుంది. ఈ స్వామి ఆరాధన వలన గ్రహదోషాలు నివారించబడుతాయని, అరిష్టాలన్నీ తొలగి పోతాయని, ఎంతటి క్లిష్ట సమస్యలైనా పరిష్కరించబడతాయని, ప్రమాదాలు నివారించబడతాయని, సర్వకార్యానుకూలత లభిస్తుందని, అభీష్టాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. కాగా ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతుంది. సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించే అవకాశం కల్పించబడుతుంది. ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 / లను సంప్రదించవచ్చును

# దత్తాత్రేయ స్వామి వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (16.04.2026) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది.ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

లోకోద్ధరణకోసమై బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు.కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు.వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చోని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# ఉమెన్ సేఫ్టీ గురించి మీటింగ్ ఏర్పాటు చేయడమైనది



మనగళం శ్రీశైలం : దీనిలో ముఖ్యంగా అమ్మాయిలకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలని మరియు సమాజంలో ఇతరుల పట్ల ఎలా మెలగాలని, మెలిగే క్రమంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా ఎదుర్కొని అవసరమైతే 100 గానీ ఏదైనా సైబర్ నేరాలకు గురి అయితే 1930కు కాల్ చేయాలని తెలపటమైనది. అదేవిధంగా ఏ విషయంలో కూడా భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని బాగా చదువుకునే విధంగా పిల్లలను ప్రోత్సహించాలని టీచర్లకు తెలియజేయడమైనది



- శ్రీ నంద్యాల జిల్లా ఎస్పీ గారి ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు డిఎస్పీ గారి పర్యవేక్షణలో సుండి పెంట పిఎస్ పరిధిలో ఉన్న డిఏవి హైస్కూల్ నందు టీచర్స్ తో ఉమెన్ సేఫ్టీ గురించి మీటింగ్ ఏర్పాటు చేయడమైనది.


మా కలం.. మీ గళం..

మన గళం

దిన పత్రిక


# వాల్మీకి ఉద్యమ నేత... రైల్వే ఆనందరాజు కు బ్రెయిన్ స్ట్రోక్

**– ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాల్మీకి ముద్దుబిడ్డ. – ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్న వాల్మీకి సంఘాలు.**







(ఆలూరు మనగళం): ఆలూరు పట్టణానికి చెందిన వాల్మీకి ఉద్యమ నాయకుడు, రైల్వే శాఖలో సేవలందించి పదవీ విరమణ పొందిన ఆనందరాజు ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించిందని వైద్యులు వెల్లడించారు. అవసరమైన శస్త్రచికిత్సలపై వైద్యులు పర్యవేక్షణలో ఉంచినట్లు సమాచారం. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఆనందరాజు, ఎస్టీ హోదా సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా కృషి చేసిన ప్రముఖ నాయకుడు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో వాల్మీకుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగిస్తూ, సంఘం తరపున జనరల్ సెక్రటరీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. 2002లో ఆలూరులో “వాల్మీకి సింహ గర్జన“ పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించి, వాల్మీకుల్లో చైతన్యం నింపారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆయన ఉద్యమాన్ని కొనసాగిస్తూ సమాజ సేవలో నిమగ్నమయ్యారు. అప్పట్లో బళ్లారి నుంచి ఆదోని వరకు ప్రత్యేక రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే మంత్రిని పలుమార్లు కలసి విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, ఆనందరాజు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిన ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి, ఆనందరాజు తనయుడు 6టీవీ రిపోర్టర్ గుత్తి నాగరాజును ఇంటికి పిలిపించుకుని ఆయన తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆనందరాజు త్వరగా కోలుకుని సురక్షితంగా ఇంటికి చేరాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ప్రస్తుతం ఆనందరాజు ఆరోగ్య పరిస్థితిపై వాల్మీకి సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలువురు సంఘం నాయకులు, రాజకీయ ప్రముఖులు ఆయనను పరామర్శిస్తూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు.

# నీటి ప్రాజెక్ట్ లలో రాయసీమకు అన్యాయం

- వేదవతి ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలి.
- రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి...చంద్రబాబు.
- ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి.






(ఆలూరు మనగళం): కర్నూలు నగరంలో బిర్లా గేటు సమీపంలోని శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ నీటి ప్రాజెక్టులు సమాలోచన సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి మాట్లాడుతూ, రాయలసీమకు నీరు సరిగ్గా పంపిణి చేయకుండా రాయలసీమకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నాడు అన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కరువు సీమకు వరం ”గుండ్రేవుల రిజర్వాయర్“ పనులను తక్షణమే ప్రారంభించాలి అని అన్నారు. రాయలసీమలో నీటి కొరత, రైతుల సమస్యలు, ఎక్కువగా ఉన్నాయి అని అన్నారు. మా ఆలూరు నియోజకవర్గంలో వేదవతి ప్రాజెక్ట్ ను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోతున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, గంగుల ప్రభాకర్ రెడ్డి, వైస్సార్సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొన్నారు.

# తేజస్ పుట్టినరోజు వేడుకలో అలరించిన... ఎమ్మెల్యే విరుపాక్షి

**– ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఎదగాలని ఆశీర్వదించారు**








(ఆలూరు మనగళం): ఆలూరు పట్టణంలో ఆలూరు వైసీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు వరుణ్ కుమార్ తనయుడు తేజస్ మొదటి పుట్టినరోజు మహోత్సవ వేడుకలో ముఖ్య అతిథిగా హాజరైన ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ తేజస్ కు సంపూర్ణ ఆరోగ్యంతో మరియు వంద సంవత్సరాలు ఆయుష్షును భగవంతుడు ప్రసాదించాలని, అలాగే ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటూ సంపూర్ణ ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, బీవీర్ అభిమానులు పాల్గొన్నారు.

# అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం




మనగళం శ్రీశైలం : శ్రీరావి నాగమణి, ప్రకాశం జిల్లా వారు ఈ రోజు ( 16.04.2026) అన్నప్రసాదవితరణ పథకానికి విరాళం రూ. 1,00,000 /-లను అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి సతీష్ మల్లిక్ కు అందజేశారు. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేయబడ్డాయి.

# ఏఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు




(ఆలూరు మనగళం): ఏఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ గురువారం ఆలూరు మండల కేంద్రంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటియుసి తాలూకా అధ్యక్షుడు కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి ముఖ్య అంశాలపై రాష్ట్ర మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ముందుకు వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత బలపరచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి తాలూక కార్యదర్శి రంగన్న, రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శి చంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, సిపిఐ సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధి లింగ, ఏఐటీయూసీ తాలూకా ఉపాధ్యక్షులు శివన్న, విద్యుత్ మీటర్ లీడర్స్ యూనియన్ నాయకుడు అబ్దుల్ గని, వీరేష్, నారాయణ, షేక్షావలి, వన్నూరప్ప ఖాదర్ బాషా, ఎల్లప్ప, నాయకులు, కార్మికులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో చేరండి...ప్రభుత్వ పతకాలు పొందండి.



(ఆలూరు మనగళం): ఆలూరు మండలం, కురుకుంద గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా ప్రవేశపెట్టిన “బడి బాట“ కార్యక్రమం విద్యార్థులుతో కలిసి నిర్వహించడం జరిగింది. గ్రామంలో వీధి వీధి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ బడి లో చేర్పించాలని స్లోగన్స్ ఇవ్వడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాలలో చాలా మార్పులు తీసుకొచ్చారు. నిన్న వచ్చిన ఇంటర్ ఫలితాలు అందరిని ఆశ్చర్యం కలిగించాయి. ప్రవేటు కాలేజీ లకు ధీటుగా ప్రభుత్వం కాలేజీ లో చదివే విద్యార్థులకు 952/1000 రావడం జరిగింది. ఒత్తిడి లేని నాణ్యమైన విద్యా. 6నుండి 10తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం. పాఠశాల ప్రారంభం రోజునే తల్లికి వందనం డబ్బులు జమ. ఉచిత బట్టలు, బూట్లు, బెల్టు, బ్యాగ్, బుక్స్, నోట్ బుక్స్, డిక్షణరీ ఇంకా మరెన్నో సౌకర్యాలు కలిగిన మన ప్రభుత్వ పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించండి. కావున ప్రవేట్ బడుల లక్షలు లక్షలు పోసి చవించడం మాని ప్రభుత్వ బడిలో చేర్పించాలని గ్రామంలో అందరికి చెపుతు బడి పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వాల్మీకి శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ దేవిరెడ్డి, తిమ్మారెడ్డి, గోపాల్, శీన, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



– విద్యా కమిటీ చైర్మన్ వాల్మీకి శ్రీరాములు.





మీ నగరూరు రాఘవేంద్ర
ఆంధ్రప్రదేశ్ విద్య మరియు సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్

# ముంబైలోకి కొత్త ఆటగాడు



ముంబై, మన గళం: ఐపీఎల్ 2026లో వరుస ఓటములతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. గాయపడిన అథర్వ అంకోలేకర్ స్థానంలో యువ ఆల్‌రౌండర్ క్రిష్ భగత్ ను జట్టులోకి చేర్చింది. 21 ఏళ్ల క్రిష్ భగత్ కుడిచేతి ఆల్‌రౌండర్‌గా పంజాబ్ తరఫున దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. అతను వేగ బౌలింగ్‌తో పాటు దిగువ క్రమంలో దూకుడుగా బ్యాటింగ్ చేయగల సామర్థ్యం కలిగిన ఆటగాడు. గత రెండు సంవత్సరాలుగా ముంబై జట్టు ట్రయల్స్‌లో పాల్గొంటూ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ సీజన్ ప్రారంభం నుంచే క్రిష్ భగత్ జట్టుతో సహాయక బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రాక్టీస్ సెషన్లు, ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో అతని బౌలింగ్ కోచింగ్ సిబ్బందిని ఆకట్టుకుంది. అతని కృషి, అంకితభావం కారణంగానే ప్రధాన జట్టులోకి అవకాశం ఇచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. గణాంకాల పరంగా చూస్తే, క్రిష్ ఇప్పటివరకు ఆడిన ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో పరుగులతో పాటు వికెట్లు కూడా సాధించాడు. లిస్ట్–ఏ క్రికెట్‌లోనూ సమతుల్య ప్రదర్శన కనబరిచాడు. సంఖ్యలు తక్కువగా ఉన్నప్పటికీ, టి20 ఫార్మాట్‌కు అవసరమైన వేగం, దూకుడు అతనిలో ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక జట్టు పరిస్థితి చూస్తే, హార్దిక్ పాండ్యా సారథ్యంలో ముంబై ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒకే విజయం సాధించింది. రోహిత్ శర్మ ఫిట్‌నెస్ కూడా జట్టుకు ఆందోళనగా మారింది. ఈ నేపథ్యంలో నేడు పంజాబ్ కింగ్స్ తో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు క్రిష్ భగత్ జట్టులో చేరడం ముంబైకి కొంత ఊరటనిస్తోంది.

# కమిన్స్ రాకతో ఎస్ఆర్‌హెచ్‌కు ఊరట



హైదరాబాద్, మన గళం: ఐపీఎల్ 2026లో మిశ్రమ ఫలితాలతో కొనసాగుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు భారీ శుభవార్త అందింది. జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులో చేరేందుకు సిద్ధమయ్యాడు. వెన్ను గాయంతో బాధపడుతున్న కమిన్స్ ఇటీవల ఆస్ట్రేలియాలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడ చేసిన స్కానింగ్‌లో గాయం పూర్తిగా నయం అయినట్లు తేలింది. దీంతో త్వరలోనే అతను భారత్‌కు చేరుకుని జట్టుతో కలవనున్నాడు. ఈ నెల 25న జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్ తో జరిగే మ్యాచ్‌లో మైదానంలోకి తిరిగి దిగే అవకాశాలు ఉన్నాయి. సీజన్ ప్రారంభానికి ముందే భారత్‌కు వచ్చిన కమిన్స్, కోల్‌కతా జట్టుతో జరిగిన మ్యాచ్ తర్వాత గాయం కారణంగా స్వదేశానికి వెళ్లాల్సి వచ్చింది. అతని గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించాడు. అతని సారథ్యంలో జట్టు ఐదు మ్యాచ్‌లలో రెండు విజయాలు సాధించింది. ఇటీవల జరిగిన మ్యాచ్‌లో యువ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయం అందించారు. అయినప్పటికీ కెప్టెన్ కమిన్స్ తిరిగి రావడం జట్టు బౌలింగ్ బలాన్ని మరింత పెంచనుంది. అలాగే కెప్టెన్సీలోనూ స్థిరత్వం తీసుకురానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో చెన్నై జట్టుతో జరగనున్న మ్యాచ్‌కు ముందు కమిన్స్ చేరడం ఎస్ఆర్‌హెచ్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చే అంశంగా మారింది.

# చెన్నైకు షాక్...ఖలీల్ గాయం.



చెన్నై, మన గళం: ఐపీఎల్ 2026లో ఐదుసార్లు ఛాంపియన్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌కు పెద్ద దెబ్బ తగిలింది. జట్టు కీలక ఎడమచేతి వేగ బౌలర్ ఖలీల్ అహ్మద్ తొడ కండరాల గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని జట్టు యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. చెపాక్ మైదానంలో కోల్‌కతా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో బౌలింగ్ చేస్తూ ఖలీల్ గాయపడ్డాడు. తన ఓవర్ వేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుడి కాలు పట్టేయడంతో మైదానంలోనే కుప్పకూలిపోయాడు. మొదట స్వల్ప గాయమని భావించినా, తర్వాత అది తీవ్రమైన కండరాల గాయంగా తేలింది. దీంతో అతను మ్యాచ్‌ను మధ్యలోనే వదిలి బయటకు వెళ్లాల్సి వచ్చింది. ఖలీల్ గాయంతో ఆ ఓవర్‌లో మిగిలిన బంతులను మరో బౌలర్ పూర్తి చేశాడు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించగా, పూర్తిగా కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వైద్యులు సూచించారు. దీంతో ఈ సీజన్‌కు అతను దూరమయ్యాడని జట్టు స్పష్టం చేసింది. జట్టుకు కీలకమైన ఈ దశలో ప్రధాన బౌలర్ గాయపడటం చెన్నైకు ఆందోళన కలిగిస్తోంది. ప్లేఆఫ్స్ రేసు సమీపిస్తున్న తరుణంలో ఖలీల్ లేకపోవడం జట్టు బౌలింగ్ బలాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కోహ్లీ మార్గదర్శనం



ముంబై, మన గళం:ఐపీఎల్ 2026లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు చేతిలో లక్నో జట్టు ఓటమి చవిచూసింది. అయితే మ్యాచ్ అనంతరం మైదానంలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.బెంగళూరు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మ్యాచ్ ముగిసిన వెంటనే లక్నో యువ ఆటగాళ్లను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా యువ బౌలర్ నమన్ తివారీ కోహ్లీ వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకోవడానికి పాదాలకు నమస్కారం చేశాడు. ఈ దృశ్యం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.అనూహ్యంగా జరిగిన ఈ ఘటనతో కోహ్లీ క్షణం ఆశ్చర్యపోయినా వెంటనే చిరునవ్వుతో నమన్‌ను పైకి లేపి అభినందించారు. యువ ఆటగాళ్ల పట్ల ఆయన చూపించిన ఈ వినయం, మార్గదర్శనం అభిమానులను ఆకట్టుకుంది.యువ క్రికెటర్లకు ఈ టోర్నమెంట్ అనేది కేవలం పోటీ మాత్రమే కాదు, సీనియర్ ఆటగాళ్ల నుంచి నేర్చుకునే గొప్ప వేదికగా నిలుస్తోంది. నమన్ తివారీ వంటి యువ ఆటగాళ్లు తమ ఆదర్శ ఆటగాళ్లను కలుసుకుని స్ఫూర్తి పొందుతున్నారు.

# అక్సెల్సన్ వీడ్కోలు



కోపెన్‌హాగెన్, మన గళం: బ్యాడ్మింటన్ ప్రపంచంలో ఒక యుగానికి ముగింపు పలికింది. డెన్మార్క్‌కు చెందిన దిగ్గజ షట్లర్ విక్టర్ అక్సెల్సన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌కు వీడ్కోలు పలికారు. కొంతకాలంగా వేధిస్తున్న వెన్ను గాయం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. 32 ఏళ్ల వయసులోనే రిటైర్మెంట్ ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. కోర్టులో ప్రత్యర్థులకు కఠిన సవాలు విసిరే ఆటతీరుతో అక్సెల్సన్ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో ఆయన ఒక అగ్రశ్రేణి ఆటగాడిగా నిలిచారు.తన కెరీర్‌లో అక్సెల్సన్ అనేక విశేష విజయాలు సాధించారు. ఒలింపిక్స్‌లో రెండుసార్లు స్వర్ణ పతకాలు గెలుచుకొని చరిత్ర సృష్టించారు. అలాగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో కూడా పలు సార్లు విజేతగా నిలిచి తన ప్రతిభను నిరూపించారు. ప్రపంచ నంబర్ ఒకటిగా 183 వారాల పాటు కొనసాగడం ఆయన గొప్పతనాన్ని తెలియజేస్తుంది. అయితే వెన్ను గాయం తీవ్రంగా ఉండటంతో టోర్నీలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన చివరకు రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నారు. ఆయన వీడ్కోలుతో బ్యాడ్మింటన్ ప్రపంచం ఒక గొప్ప ఆటగాడిని కోల్పోయింది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.